క్లుప్తంగా

అడవి పందుల బెడద నివారించాలి



అడవి పందులు ధ్వంసం చేసిన బెండతోట

కొత్తూరు: అడవి పందుల కారణంగా పంటలు నష్టపోతున్నామని మండల పరిధిలోని తీగాపూర్, మల్లాపూర్, చింతగట్టుతండాతో పాటు పలు గ్రామాలకు చెందిన రైతులు వాపోతున్నారు. వ్యవసాయ పొలాలకు సమీపంలో ఉన్న రాళ్ల గుట్టలు, చెట్లు అడవి పందులకు స్థావరాలుగా మారినట్లు వివరించారు. పందులు ఉదయం వేళల్లో గుట్టల్లో ఉంటూ రాత్రి వేళల్లో పంటలను నష్టం చేస్తున్నాయని పేర్కొంటున్నారు. ముఖ్యంగా కూరగాయలు, ఆకుకూరల తోటలను నష్టపరుస్తున్నట్లు చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అడవి పందుల బెడదను నివారించాలని కోరుతున్నారు.

ఆదమరిస్తే అంతే..



నేలపైన ట్రాన్స్‌ఫార్మర్

కొత్తూరు: కంచెలు లేని, రోడ్లు, ఇళ్ల సమీపంలో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల కారణంగా ప్రమాదాలు జరిగి ప్రజలు, మూగ జీవాలు బలైతున్నాయి. అయినా స్థానిక ట్రాన్స్‌కో అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్లను సరిచేయడం లేదు. మండలంలోని సిద్ధాపూర్ గ్రామంలో ప్రధాన కూడలి వద్ద ఓ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మె చాలా కిందకు ఉంది. మూగజీవాలు, ప్రజలు గమనించకుండా సమీపం నుంచి వెళ్లి ప్రమాదానికి గురయ్యే అవకాశం లేకపోలేదు. ఇప్పటికైనా ట్రాన్స్‌కో అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మెను ఎత్తుపెంచడంతో పాటు కంచె ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

జీవాలకు టీకాలు తప్పనిసరి



కేశవగూడలో జీవాలకు టీకాలు వేస్తున్న పశువైద్య సిబ్బంది

చేవెళ్ల/షాబాద్: రైతులు గొర్రెలు, మేకలకు వ్యాధినిరోధక టీకాలను తప్పనిసరిగా వేయించాలని షాబాద్ మండల పశువైద్యాధికారిణి డాక్టర్ స్రవంతి అన్నారు. మండలంలోని కేశవగూడ, నరేడ్లగూడ గ్రామాల్లో బుధవారం ఆమె గొర్రెలు, మేకలకు టీకాలు వేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. జీవాలకు వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాలు తిరిగి పశువైద్యశాఖ ఆధ్వర్యంలో టీకాలను వేస్తున్నామని జీవాలను పోషించుకునే రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది బలరాం, రాణి, రైతులు తదితరులు ఉన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం

కడ్తాల్: మండల పరిధిలోని ముద్విన్ గ్రామంలో రమణమోణి స్నేహ, పుల్కారపు కృష్ణయ్య ఇటీవల మృతి చెందారు. బుధవారం బాధిత కుటుంబాలను జెడ్పీటీసీ రాధాకృష్ణ, చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ దశరథ్‌నాయక్ పరామర్శించి రూ.5వేల చొప్పున ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్ గంప వెంకటేశ్‌గుప్తా, మాజీ సర్పంచ్ యాదయ్య, సింగిల్‌విండో డైరెక్టర్‌లు వెంకటయ్య, జంగయ్య, గోపాల్ ఉన్నారు.

ఆంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవానికి ఆహ్వానం

మాడ్గుల: మండలంలోని అందుగుల గ్రామంలో జూన్1న జరిగే అభయ ఆంజనేయస్వామి ప్రథమ వార్షికోత్సవం, బొడ్రాయి ప్రతిష్ఠ వేడుకకు రావాలని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిని గ్రామస్తులు కోరారు. బుధవారం హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే నివాసంలో మాడ్గుల మండల సింగిల్ విండో డైరెక్టర్ కొప్పు జగన్, మాజీ రైతు సమన్వయ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, దేవస్థాన కమిటీ సభ్యులు కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ గోపినాయక్, గ్రామస్తులు ఉన్నారు.

అద్దె భవనాలు.. అరకొర వసతులు

- డివిజన్, మండలాల ఏర్పాటుతోనే సరి..
- సొంత భవనాలకు నోచుకోని ప్రభుత్వ కార్యాలయాలు
- పాలనలో ఏర్పడుతున్న అసౌకర్యం
- ఇబ్బంది పడుతున్న అధికారులు, ప్రజలు



అద్దె భవనంలో కొనసాగుతున్న తహసీల్దార్ కార్యాలయం

నందిగామ: పాలన సౌలభ్యం కోసం కొత్త డివిజన్‌లు, మండలాలు ఏర్పాటైన సొంత భవనాలు లేకపోవడంతో అసౌకర్యాల నడుమ పాలన కొనసాగుతోంది. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం నూతన మండలాల ఏర్పాటులో భాగంగా అప్పట్లో కొత్తూరు మండలంలోని మేజర్ గ్రామ పంచాయతీ అయిన నందిగామను నూతన మండలముగా ఏర్పాటు చేసింది. నందిగామ మండలంలో 8 గ్రామ పంచాయతీలను కలిపింది. ప్రస్తుతం మండలంలో 19 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. నూతన మండలముగా ఏర్పడి సంవత్సరాలు గడుస్తున్నా ప్రభుత్వ శాఖల కార్యాలయాలకు వసతుల కల్పన, సిబ్బంది పడుతున్న ఇబ్బందులను తొలగించడంలో ప్రభుత్వం కనీస శ్రద్ధ చూపడంలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. దీంతో అధికారులతో పాటు వివిధ పనుల నిమిత్తం ఆయా కార్యాలయాలకు వచ్చే వారికి ఇబ్బందులు తప్పడం లేదు.

కార్యాలయాలు ఇలా..

నూతనంగా ఏర్పాటైన నందిగామ మండలంలో తహసీల్దారు, ఎంపీడీఓ కార్యాలయాలు అద్దె భవనాల్లో కొనసాగుతుండగా, పోలీస్ స్టేషన్‌ను ప్రారంభంలో గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేశారు. కొంతకాలం తర్వాత నాట్కో పరిశ్రమ సహకారంతో నూతనంగా పోలీస్ స్టేషన్ భవనాన్ని నిర్మించారు. దీంతో పోలీస్ స్టేషన్ సొంత భవనంలోకి తరలించారు.

తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాలు..

మండలంలో కీలక కార్యాలయాలైన తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాలు ఇరుకు గదుల్లో అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. ఆ భవనాల్లో కనీస సౌకర్యాలు లేకపోవడంతో అటు సిబ్బంది, ఇటు ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. తహసీల్దార్ కార్యాలయం పాత జాతీయ రహదారిపై ఓ వేబ్రిడ్జి భవనంలో ఏర్పాటు చేశారు. దీంతో కార్యాలయానికి వచ్చే అధికారులు, ప్రజలు వేబ్రిడ్జి వద్దకు రాకపోకలు కొనసాగించే వాహనాలతో ఇబ్బందులు పడుతుండగా, వాహనదారులు సైతం కార్యాలయం వద్ద ఉన్న ప్రజలతో ఇబ్బందులు పడుతున్నారు. అంతే కాకుండా కార్యాలయం ఇరుకుగా ఉండటంతో రికార్డులకు సైతం సరైన భద్రత లేకుండా పోయే ప్రమాదం ఉంది. దీంతోపాటు కార్యాలయంలోని సిబ్బంది టాయిలెట్‌కు వెళ్లేందుకు అవకాశం కూడా లేదు. అటు ఎంపీడీఓ కార్యాలయం పరిస్థితి మరీ దారుణంగా ఉంది. ఎంపీడీఓ కార్యాలయం ఓ ఇరుగు సందులో, సరైన వసతులు లేని భవనంలో కొనసాగుతోంది. కార్యాలయం సిబ్బందికి ఏ మాత్రం సరిపోవడం లేదు. పరిసర గ్రామాలకు చెందిన ప్రజలు ఏమైన పని నిమిత్తం కార్యాలయానికి వచ్చినట్లయితే కనీసం కూర్చోవడానికి స్థలం కూడా లేని దుస్థితి నెలకొంది.



ఇరుకు సందులో కొనసాగుతున్న ఎంపీడీఓ భవనం

బేస్‌మెంట్ వరకే పరిమితమైన ఎంపీడీఓ భవనం..

నూతనంగా ఎంపీడీఓ భవనాన్ని నిర్మిస్తామని అప్పట్లో ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి స్థానిక ఎమ్మెల్యే అంజయ్య యాదవ్‌తో కలిసి శంకుస్థాపన సైతం చేశారు. ఎంపీతో పాటు మండలంలో ఉన్న ఓ ట్రస్టు సహకారంతో భవనాన్ని నిర్మిస్తామని హామీఇచ్చారు. శంకుస్థాపన చేసిన సమయంలో ఎంపీపీ ప్రియాంక సొంతంగా సుమారు రూ.25లక్షలు వెచ్చించి బేస్‌మెంటు వరకు నిర్మించారు. అయినా కూడా దాతల నుంచి ఎలాంటి సహకారం లేకపోవంతో ఎక్కడ వేసిన పని అక్కడే ఉంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలు నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

భవనాల నిర్మాణానికి కృషి చేస్తాం

స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సహకారంతో వీలైనంత తొందరగా నిధులు మంజూరు చేయించి భవనాలను నిర్మించేందుకు కృషి చేస్తాం. అధికారులకు గానీ, ప్రజలకు గానీ ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటాం. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా పాలన అందించడంలో ముందంజలో ఉంటుంది. త్వరలోనే ఎమ్మెల్యే భవనాలను నిర్మించేందుకు కావాల్సిన నిధులు మంజూరు చేయిస్తారు.

–ప్రియాంక, ఎంపీపీ, నందిగామ మండలం

విత్తన కొనుగోలులో జాగ్రత్తలు అవసరం

ఏఓ నిషాంత్‌కుమార్



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ నిషాంత్‌కుమార్

షాద్‌నగర్‌రూరల్: రైతులు విత్తనాలను కొనుగోలు చేసే సమయంలో తగిన జాగ్రత్తలను పాటించాలని మండల వ్యవసాయ అధికారి నిషాంత్‌కుమార్ సూచించారు. బుధవారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని మధురాపూర్, కిషన్‌నగర్, భీమారం, వెంకన్నగూడ తదితర గ్రామాలలో విత్తన కొనుగోలులో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఏఓ నిషాంత్‌కుమార్ రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం నుంచి గుర్తింపు పొందిన అధీకృత డీలర్ల వద్దనే రైతులు విత్తనాలను తీసుకోవాలన్నారు. విత్తనాలు కొనుగోలు చేసినప్పుడు తప్పనిసరిగా రసీదు తీసుకోవాలని సూచించారు. కొనుగోలు చేసిన విత్తన ప్యాకెట్‌లను, రసీదులను పంటకాలం పూర్తయ్యేవరకు జాగ్రత్తగా ఉంచుకోవాలన్నారు. లూజుగా ఉన్న సంచులలోని విత్తనాలను కొనుగోలు చేయొద్దని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారులు తేజ్ కుమార్, నిఖిల్‌రెడ్డి, రమణారావు, ప్రియాంక, ప్రణీత, రైతులు తదితరులు పాల్గొన్నారు.

కరాటేలో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న అసోషియేషన్ జిల్లా అధ్యక్షుడు రాజేశ్‌పటేల్

కొందుర్గు: షాద్‌నగర్ పట్టణంలో న్యూపవర్ కుంగ్‌ఫూ అకాడమీ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన కరాటే కుంగ్‌ఫూ టోర్నమెంట్‌లో కొందుర్గు, జిల్లేడ్ చౌదరిగూడ మండలాల విద్యార్థులు ప్రతిభ చూపినట్లు మాస్టర్లు రమేశ్, నందు తెలిపారు. కటాస్ విభాగంలో మారుతి, శ్రీనందు, నహీద్ ప్రథమ స్థానం, విఘ్నేష్ ద్వితీయ స్థానం, రాజేశ్, వంశీ, సిద్ధేశ్వరి తృతీయ స్థానం, స్పైరింగ్ విభాగంలో నహీద్ ప్రథమ స్థానం, శివకుమార్, ఆశన్, సాయి, తేజ ద్వితీయ స్థానం సాధించారు. ఈ సందర్భంగా ప్రతిభ చూపిన విద్యార్థులను కొందుర్గు మండల కేంద్రంలో న్యూ మాంక్స్ కుంగ్‌ఫూ అసోషియేషన్ ఆధ్వర్యంలో అభినందించారు. విద్యార్థుల ఆత్మరక్షణకు కరాటే దోహదపడుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో అసోషియేషన్ జిల్లా అధ్యక్షుడు రాజేశ్‌పటేల్, చీఫ్ ఇన్‌స్ట్రక్టర్ రమేశ్ పాల్గొన్నారు.

పట్టపగలు వెలుగుతున్న వీధి దీపాలు



బాకారంలో పట్టపగలు వెలుగుతున్న వీధిలైట్



తోల్‌కట్టలో వెలుగుతున్న వీధి దీపం

మొయినాబాద్‌రూరల్: విద్యుత్ అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగా పట్టపగలే వీధి దీపాలు వెలుగుతూ వారి నిర్లక్ష్యాన్ని ఎత్తి చూపుతున్నాయి. దీంతో విలువైన విద్యుత్ వృథా అవుతుందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వీధి దీపాల నిర్వహణలో ఉన్న సమస్యలను విద్యుత్ సిబ్బంది పట్టించుకోవడం లేదని పలువురు విమర్శిస్తున్నారు. మండలంలో చాలా గ్రామాల్లో వీధి దీపాలు నిరంతరం వెలుగుతూనే ఉన్నాయి. పగలు, రాత్రి తేడాలేకుండా వెలుగుతుండడంతో వందలాది యూనిట్ల విద్యుత్ వృథా అవుతోంది. బుధవారం మండల పరిధిలోని బాకారం, తోల్‌కట్ట, చిన్న మంగళారం, వీరన్నపేట్ ఆయా గ్రామాల్లో వీధి దీపాలు పట్టపగలు వెలుగుతున్నాయి.

పట్టించుకోని అధికారులు

పంచాయతీ ఆదాయం, జనాభా మేరకు విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయగా.. రాత్రి పూట ఆన్ చేసి ఉదయం పూట ఆఫ్ చేయాలి. కానీ అలా జరగడం లేదు. దీంతో గ్రామ పంచాయతీలకు వేల రూపాయల బిల్లులు వస్తున్నాయి. అధికారులు స్పందించి గ్రామాల్లో వీధి లైట్లకు ఆన్, ఆఫ్ స్విచ్‌లను ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. పలు చోట్ల స్విచ్‌లు ఉన్నా ఆఫ్ చేయకపోవడంతో ఈ వీధి లైట్లు వెలుగుతున్నాయని పేర్కొంటున్నారు. పైఅధికారులు ఇప్పటికైనా స్పందించి పట్టపగలు వీధి దీపాలు వెలగకుండా చూడాలని కోరుతున్నారు.

ఘనంగా సుదర్శన హోమం



హోమంలో పాల్గొన్న గ్రామస్తులు

యాచారం: మండల పరిధిలోని చౌదర్‌పల్లిలో బుధవారం రుక్మిణి, సత్యభామ సమేత వేణుగోపాల స్వామి కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. స్థానిక హరిహర దివ్య క్షేత్ర ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా రేవల్లి రాజుశర్మ ఆధ్వర్యంలో స్వామి వారి కల్యాణోత్సవం, సుదర్శన హోమం నిర్వహించారు. గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలు ప్రారంభం

తలకొండపల్లి: మండల కేంద్రంలోని లక్ష్మీనృసింహస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు బుధవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. వేద పండితుల మంత్రోచ్చరణాల మధ్య ఆలయంలో గణపతి పూజ, మూలమంత్రం, జపములు, అంకురార్పణ, జలధివాసం, యజ్ఞహోమాలు నిర్వహించారు. జెడ్పీటీసీ వెంకటేశ్ దంపతులు యజ్ఞహోమాల వద్ద కూర్చొని ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. అన్నదానం చేశారు.



హోమంలో జెడ్పీటీసీ దంపతులు, భక్తులు

రేపు మండల సమావేశం

కేశంపేట: మండల సర్వసభ్య సమావేశం 31వ తేదీ శుక్రవారం ఎంపీపీ రవీందర్‌యాదవ్ అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ రవిచంద్రకుమార్‌రెడ్డి తెలిపారు. ఉదయం 11 గంటలకు ప్రారంభమయ్యే ఈ సమావేశానికి మండలస్థాయి అధికారులు తమ శాఖకు చెందిన పూర్తి సమాచారంతో సకాలంలో హాజరుకావాలని ఆయన తెలిపారు. ఎంపీటీసీలు, కోఆప్షన్ సభ్యులు సమావేశానికి విధిగా హాజరుకావాలని కోరారు.

ప్రమాదకరంగా మలుపు

సూచిక బోర్డు ఏర్పాటు చేయాలని స్థానికుల డిమాండ్



ప్రమాదకరంగా ఉన్న మలుపు

కొత్తూరు: మండల పరిధిలోని సిద్ధాపూర్ గ్రామం నుంచి చింతగట్టుతండాకు వెళ్లే ప్రధాన రోడ్డులో పలుచోట్ల ఉన్న మలుపులు ప్రమాదకరంగా మారాయని స్థానికులు పేర్కొంటున్నారు. మలుపుల వద్ద వాహనదారులు ఏమాత్రం అజాగ్రత్తగా వ్యవహరించిన కిందపడి ప్రమాదాలు జరుగుతున్నాయని ఆరోపిస్తున్నారు. ఇప్పటికే మలుపుల వద్ద పలు ప్రమాదాలు జరిగి స్థానికులతో పాటు పలువురు తీవ్రంగా గాయపడినట్లు చెబుతున్నారు. గతంలో మలుపుల వద్ద రక్షణ చర్యలు చేపట్టాలని అధికారులకు వినతులు ఇచ్చినా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రమాదాల నివారణకు మలుపుల వద్ద వేగ నిరోధకాలు, ప్రమాదకర సూచికలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

మరమ్మతులు చేశారు..పూడ్చడం మరిచారు



ప్రమాదకరంగా మారిన పైపులైన్ గుంత

మొయినాబాద్‌రూరల్: మండల పరిధిలోని హిమాయత్‌నగర్ సాయిబాబా దేవాలయం సమీపంలో వారంరోజుల క్రితం మంచినీటి పైపులైన్ లీకేజీతో గుంత తీశారు. ఆ పైపులైన్ లీకేజీకి మరమ్మతులు పూర్తి చేసినా గుంత పూడ్చడం మరచిపోయారు. దీంతో హిమాయత్‌నగర్ గ్రామం నుంచి చిలుకూరు బాలాజీ, తంగడిపల్లి, వికారాబాద్ వివిధ ప్రాంతాలతో పాటు గ్రామాలకు వెళ్లే రహదారి కావడంతో వాహనదారులు, ప్రజలకు ప్రమాదకరంగా మారింది. నడుచుకుంటూ వెళ్లే పాదాచారులు రోడ్డుపై వెళ్తున్న వాహనాలను చూస్తూ ఎప్పుడు ఏ సమయంలో గుంతలో పడే ప్రమాదం ఉందో తెలియని పరిస్థితి ఉందని హిమాయత్‌నగర్ గ్రామస్తులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ గుంతను పూడ్చాలని ప్రజలు కోరుతున్నారు.

మహిళలకు కుట్టుమిషన్‌లు అందజేత



మహిళలకు కుట్టు మిషన్లు అందజేస్తున్న అధ్యక్షులు రాజేశ్వర్‌రెడ్డి, వాణి

శంకర్‌పల్లి: తెలంగాణ డెవలప్‌మెంట్ ఫోరం, వనిత చేయూత ప్రాజెక్టులో భాగంగా బుధవారం మండలంలోని మోకిల గ్రామంలో ఎంపిక చేసిన 10 మంది మహిళలకు కుట్టుమిషన్‌లు అందజేశారు. అనంతరం ఫోరం ఇండియా ప్రెసిడెంట్ రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం మహిళా సాధికారతకు అనేక పథకాలు, ప్రోత్సాహకాలు అందిస్తోందని కొనియాడారు. దీంట్లో భాగంగానే మహిళలకు సాయం చేసేందుకు తమ ఫోరం ముందుకు వచ్చినట్లు స్పష్టం చేశారు. వనిత చేయూత ప్రాజెక్టు అధ్యక్షురాలు వాణి మాట్లాడుతూ.. ప్రభుత్వం తమ ప్రాజెక్టుకు ఏడు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు యూనిఫాంలను కుట్టే బాధ్యత అప్పగించిందని, దానిని ఈ విధంగా ఉపయోగించుకోనున్నట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో వీఏవో సుజాత, పద్మ, సుధాకర్, భీమయ్య, అనంతయ్య పాల్గొన్నారు.

సరదా కావద్దు విషాదం!

- ఈతకు వెళ్లి మృత్యువాతపడుతున్న విద్యార్థులు
- చూసీచూడనట్లు వ్యవహరిస్తున్న అధికారులు



గాల చెరువు గుంతలో పడి మృతి చెందిన విద్యార్థులు(ఫైల్)



యంత్రాలతో మట్టిని తీయడంతో గుంతల్లోకి చేరిన నీరు(ఫైల్)

కొత్తూరు: వేసవి సెలవుల్లో చిన్నారులు, విద్యార్థులు సరదాగా పలు ఆటలు ఆడుతుంటారు. కొన్ని క్రీడల్లో ఏమాత్రం నిర్లక్ష్యం చేసినా, సరైన జాగ్రత్తలు పాటించని కారణంగా విద్యార్థుల కుటుంబాల్లో వారి సంతోషం, సరదాలు విషాదాన్ని నింపుతున్నాయి. ముఖ్యంగా కొందరు విద్యార్థులు ఈతలు కొట్టడానికి చెరువుల్లోకి వెళ్లి నీటి గుంతల్లో పడి మృతి చెందుతున్నారు. ఇప్పటికే మండలంలోని సిద్ధాపూర్, కొడిచర్ల, కొడిచర్లతండా, ఇన్ముల్‌నర్వ గ్రామాల్లోని చెరువుల్లో ఈత కోసం దిగి యువకులు, చిన్నారులు, విద్యార్థులు పదుల సంఖ్యలో మృతి చెందారు. అక్రమ మట్టి వ్యాపారులు తీసిన గుంతలే వీరి మరణాలకు కారణమని మృతుల కుటుంబసభ్యులు రోధిస్తున్నారు.

ఈతకు వెళ్లి పదుల సంఖ్యలో మృతి..

- ఎనిమిదేళ్ల క్రితం మండలంలోని కొడిచర్ల పంచాయతీ ఖాజీగూడ తండాకు చెందిన ముగ్గురు విద్యార్థులు వేసవి సెలవుల్లో భాగంగా ఇళ్లకు వచ్చారు. వారు సరదాకు తండా సమీపంలోని గాల చెరువులో ఈతకు వెళ్లి గుంతల్లో పడి మృతి చెందారు.
- జేపీ దర్గా దర్శనం కోసం ఆయా ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు సమీపంలోని చెరువులోకి ఈతకు దిగుతున్నారు. అప్పటికే మట్టి వ్యాపారులు తీసిన గుంతలపై వీరికి అవగాహన లేక లోతు తెలియక మునిగి పదుల సంఖ్యలో మృతి చెందారు.
- సిద్ధాపూర్, ఇన్ముల్‌నర్వ గ్రామాల్లోని స్టోన్ క్రషర్ల నిర్వాహకులు తీసిన గుంతల్లో ఈతకు దిగి స్థానికులు మృత్యువాత పడ్డారు.
- మండలంలోని కొత్తూరు, గూడూరు గ్రామాల్లోని చెరువుల్లో సరదాకు చేపలు పట్టడానికి వెళ్లి లోతు తెలియక పెద్ద పెద్ద గుంతల్లో పడి స్థానికులు సైతం మృతి చెందారు.

ప్రకటనలకే పరిమితం..

ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రకృతి సహజసిద్ధంగా ఏర్పడిన చెరువులు, కుంటల్లో నుంచి అనుమతులు లేకుండా మట్టిని తీయరాదు. రైతులు మాత్రం యంత్రాలతో కాకుండా నిర్ణీతలోతు వరకు ఒండ్రు మట్టిని అనుమతులతో తీసుకోవచ్చు. కాగా మండలంలోని పలు చెరువుల్లో అక్రమ మట్టి వ్యాపారులు సంబంధిత పంచాయతీకి రాయల్టీ(పన్నులు) చెల్లిస్తున్నామని చెబుతూ నిబంధనలకు విరుద్ధంగా యంత్రాలతో భారీ తవ్వకాలు చేస్తున్నారు. చెరువుల్లో మట్టి తవ్వకాల విషయమై ఇరిగేషన్ శాఖ అధికారుల దృష్టికి తేస్తే వారు వ్యాపారులపై చర్యలు తీసుకుంటామని ప్రకటిస్తున్నారే తప్పా ఇప్పటివరకు స్పందించిన పాపాన పోలేదని పలువురు ఆరోపిస్తున్నారు.